
సాక్షి ఒడిశా

బుధవారం । 20 । నవంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 5,05,718
బంగారం	8 గ్రాముల 250 మిల్లీ గ్రాములు
వెండి	20 గ్రాముల 900 మిల్లీ గ్రాములు

భువనేశ్వర్/పూరీ



గంజాయి పంట దహనం

గంజాయి పంటను పోలీసులు ధ్వంసం చేశారు. పంటనంతా కాల్చేశారు.

- 8లో



వన్‌డే టికెట్ ధరల తగ్గింపు

కటక్‌లో జరగనున్న వన్‌డే మ్యాచ్ టికెట్ ధరలు తగ్గించారు. కొత్త ధరలు ప్రకటించారు.

- 8లో

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

- కనీస మద్దతు ధర రూ.2,300
- సాగు పెట్టుబడి ప్రోత్సాహం రూ.800
- డిప్యూటీ సీఎం కనక వర్ధన్ సింగ్ దేవ్ ప్రకటన



డిప్యూటీ సీఎం కనక వర్ధన్ సింగ్‌దేవ్

భువనేశ్వర్: రాష్ట్రంలోని రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమవుతుందని డిప్యూటీ సీఎం, వ్యవసాయం, రైతు సాధికారిత విభాగం మంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ తెలిపారు. ఈసారి ధాన్యం విక్రయించే రైతులకు కనీస మద్దతు ధర రూ.2,300 లతో అదనంగా సాగు పెట్టుబడి ప్రోత్సాహం కింద రూ.800లు లభిస్తాయి. ఈ మొత్తం విడుదల డిసెంబర్ 8వ తేదీ నుంచి ఆరంభం అవుతుంది. రైతుల పొదుపు ఖాతాకు ప్రత్యక్షంగా ఈ సొమ్ము బదిలీ అవుతుందని మంత్రి స్పష్టం చేశారు.

పారదర్శకంగా

రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ సర్కారు తొలిసారిగా రైతాంగం నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోంది. పూర్తి విభిన్నంగా రైతులకు అనుకూలంగా ఉండే రీతిలో ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు రంగం సిద్ధం చేసింది. సమగ్ర ప్రక్రియ అత్యంత సరళంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ చేశారు. విక్రయానికి సిద్ధం చేసిన ధాన్యం నాణ్యత పరిశీలన కోసం ప్రత్యేక ధాన్య నాణ్యత విశ్లేషకులను నియమించారు. వరి సేకరణ, కొనుగోళ్ల మండీ ప్రాంగణాల్లో ఈ యంత్రాంగం అందుబాటులో ఉంటుంది. వరి సాగు పుష్కలంగా ఉండి అధికంగా విక్రయించే ప్రాంగణాల్లో ఈ నిపుణుల బృందాలను నియమించారు. కొన్ని ప్రాంతాలు మినహా అత్యధిక ప్రాంతాల్లో ధాన్యం నాణ్యత విశ్లేషకులు అందుబాటులో ఉంటారని మంత్రి వివరించారు.

సందేహాల నివృత్తికి

ధాన్యం విక్రయాలు పురస్కరించుకుని రైతాంగం సందేహాల నివృత్తికి సమగ్ర నియమావళి అందుబాటులో ఉంటుంది. వరి నాణ్యత (తేమ వంటి అంశాలు) విశ్లేషణ పారదర్శకంగా ప్రదర్శితం అవుతుంది. ఒక్కో రైతు వరి విక్రయం పురస్కరించుకుని 2 చొప్పున టోకెన్లు జారీ చేస్తారు. వీటిలో ఒకటి రైతు దగ్గర, మరొకటి ప్రభుత్వం దగ్గర ఉంటుంది. దీని ఆధారంగా వరి విక్రయం లావాదేవీల సమగ్ర సమాచారం పారదర్శంగా నిర్వహించడం జరుగుతుందని మంత్రి వివరించారు. ఈ లెక్కన ఈ ఏడాది వరి విక్రయం అత్యంత సరళీకర వ్యవస్థ ఆధ్వర్యంలో పారదర్శకంగా విజయవంతం కాగలదని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

వికసిత ఒడిశా రూపకల్పనకు సన్నాహాలు



అభివృద్ధి కమిషనర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం

భువనేశ్వర్: రాష్ట్ర అవతరణ శతాబ్ది దగ్గర పడుతోంది. 2036 సంవత్సరంలో రాష్ట్రం శతాబ్ది పూర్తి చేసుకుంటుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వికసిత ఒడిశా ఆవిష్కరించాలని నడుం బిగించింది. సాధికారిత సాధన దిశలో సరికొత్త ఆశలు, సృజనాత్మక కార్య శైలి, అభివృద్ధి చెందిన సమాజం వంటి ఉన్నత దృక్పథ కార్యాచరణ రూపకల్పన కోసం సమాజంలో అన్ని వర్గాల నుంచి అమూల్యమైన అభిప్రాయాల్ని ఆహ్వానించింది. ఈ గడువుని మరి కొద్ది కాలం పొడిగించాలని ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయించారు. లోగడ ప్రకటించిన ప్రకారం వికసిత ఒడిశా ఆవిష్కరణ ప్రతిపాదనల దాఖలు గడువు బుధవారం (ఈ నెల 20)తో ముగియాల్సి ఉంది. ఈ గడువుని డిసెంబరు నెల 5వ తేదీ వరకు పొడిగించారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ 2047కి సంబంధించిన మార్గదర్శకాల్ని ప్రజలు దాఖలు చేసేందుకు వీలవుతుందని ప్రకటించారు.

నీతీ ఆయోగ్ ప్రముఖ కార్యనిర్వాహక అధికారి సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వికసిత్ ఒడిశా, వికసిత్ భారత్ ఆవిష్కరణకు సంబంధించి ప్రజాభిప్రాయాల దాఖలు ఇతరేతర అనుబంధ కార్యకలాపాల్ని ప్రత్యక్షంగా సమీక్షించారు. రాష్ట్ర అభివృద్ధి కమిషనరు అనూ గర్గ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాభిప్రాయాల దాఖలు గడువుని పొడిగించినట్లు ప్రకటించారు. భావి అవసరాలు, సవాళ్లని దృష్టిలో ఉంచుకుని వికసిత్ ఒడిశా దార్శనిక (విజన్) పత్రం రూపకల్పన జరగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అభ్యర్థించారు. సోమవారం సాయంత్రం సరికి సమాజంలో వివిధ వర్గాల నుంచి 15 వేల ప్రతిపాదనలు దాఖలైనట్లు అభివృద్ధి కమిషనరు తెలిపారు. డిసెంబరు నెల 5వ తేదీ వరకు ప్రతిపాదనల్ని దాఖలు చేసేందుకు వీలు అవుతుంది. ప్రజలు తమ అభిప్రాయాల్ని ఈ-మెయిల్ లేదా వాట్సాప్ ద్వారా దాఖలు చేసేందుకు వీలు కల్పించారు. 63709-51920 నంబర్‌కు సూచనలు వాట్సాప్ చేయాలన్నారు.

న్యూస్‌రీల్

సబ్ కలెక్టర్ అరెస్ట్



నారాయణ చంద్ర నాయక్

భువనేశ్వర్: ఢెంకనాల్ కామాఖ్య నగర్ సబ్ కలెక్టర్ నారాయణ చంద్ర నాయక్‌ని మంగళవారం విజిలెన్స్ అధికారులు అరెస్టు చేశారు. అక్రమంగా లెక్కాజమ లేని ఆస్తులు ఆర్జించినట్లు అతనికి వ్యతిరేకంగా ఆరోపణ. సోమవారం నిర్వహించిన సోదాల్లో ఇందుకు సంబంధించిన ఆధారాలు లభ్యం కావడంతో అరెస్టు చేసినట్లు వివరించారు. సోదాల్లో భాగంగా భువనేశ్వర్ తదితర ప్రాంతాల్లో 3 బహుళ అంతస్తు భవనాలు, 14 ఇళ్ల స్థలాలు, 365 గ్రాముల బంగారం, రూ.34,57,000 బ్యాంకు పొదుపు ఖాతాలో నిల్వ, రూ.1.48 లక్షల నగదు స్వాధీనపరచుకున్నారు.

బ్రిటిష్ వంతెనపై హెచ్చరిక బోర్డులు



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొరాపుట్: కొరాపుట్-నబరంగ్‌పూర్ జిల్లాలను విడదీస్తున్న ఇంద్రావతి నది పై బ్రిటిష్ వారు ఇనుప వంతెన నిర్మించారు. ఆ నిర్మాణం శిథిలావస్థకు చేరుకుంది. దాని మీద వాహనాలు రాకపోకలు లేనప్పటికీ పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ ప్రమాదకర గోతులు కనిపిస్తున్నాయి. వీటిని గమనించిన నబరంగ్‌పూర్ పట్టణానికి చెందిన ఐకాన్స్ ఇన్ మొషన్స్ యువజన సంస్థ సభ్యులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

5టి పాఠశాలల పరిశీలన



నోడల్ పాఠశాలలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే హికక

రాయగడ: గత ప్రభుత్వం అమలు చేసిన 5టి పథకంలో భాగంగా అభివృద్ధి చెందిన వివిధ పాఠశాలలను బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా మునిగుడలొ గల నొడల్ మాధ్యమిక ఉన్నత పాఠశాలలో పర్యటించిన ఆయన 5టి పథకంలొ మంజూరైన నిధులతో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. సమితి ఏఈఓ ఐశ్వర్య భంజదేవ్ ఈ సందర్భంగా పాఠశాలలో గల వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే నిధుల నుంచి అదనపు తరగతి గదులను నిర్మించేందుకు హామీ ఇచ్చారు.

25న అఖిల పక్ష సమావేశం

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ స్పీకర్ సురమా పాఢి అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం ఖరారైంది. శాసనసభలో ఆమె అధ్యక్షతన ఈ సమావేశం ఈనెల 25వ తేదీన జరుగుతుందని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ మంగళవారం తెలిపారు. శాసనసభ శీతాకాలం సమావేశాలు పురస్కరించుకుని అఖిల పక్షాలతో స్పీకర్ సమావేశం కానున్నట్లు మంత్రి వివరించారు. ఈనెల 26వ తేదీ నుంచి శాసనసభ శీతాకాలం సమావేశాలు ఆరంభం అవుతాయి. డిసెంబర్ 31వ తేదీ వరకు నిరవధికంగా కొనసాగుతాయి. ఈ వ్యవధిలో 25 పని దినాలు ఉంటాయి. పలు బిల్లులను సభలో ప్రవేశ పెట్టనున్నారు. విపక్షాల అభ్యర్థనలపై సమర్థవంతంగా స్పందించేందుకు అధికార పక్షం సిద్ధంగా ఉందని మంత్రి ముఖేష్ మహా లింగ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ విడత సమావేశంలో మధ్యంతర బడ్జెట్‌ని సభలో ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు.

కొరాపుట్ @7.9 డిగ్రీల ఉష్ణోగ్రత



చలిమంట వద్ద కాచుకుంటున్న దృశ్యం

కొరాపుట్: జిల్లాలో కనీస స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మంగళవారం ఉదయం 7.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. దీంతో చలిపులి పంజా విసిరింది. సాయంత్రం 6 గంటలకే ప్రజలు ఇళ్లకి పరిమితం అవుతున్నారు. రాత్రిపూట సుదూర ప్రాంతాలకు నడిచే బస్సు సర్వీసుల్లో ప్రయాణికులు అల్పంగా ఉంటున్నారు. కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక అగ్గిమంట వద్ద చలి కాచుకుంటూ, ప్రస్తుతం రాజకీయ వాతావరణం కూడా చల్లబడి పోయిందని సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు.

కార్చిచ్చు నివారణకు కసరత్తు



అగ్నిప్రమాదాల నివారణకు యాక్షన్ ప్లాన్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, డీఎఫ్ఓ, ఆనంద్, ఎస్పీ, సబ్ కలెక్టర్

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్ హాల్ నంబర్ 1లో జిల్లా స్థాయి అగ్నినివారణ సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.ఆనంద్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, ఎస్పీ జితేంద్ర నాథ్ పండా, ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, సబ్ కలెక్టర్ అనూప్ పండా అటవీ రేంజ్ అధికారులు, తహసీల్దార్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. శీతాకాలంలో గజపతి జిల్లాలో మొత్తం అటవీ ప్రాంతాల్లో గత ఏడాది 921 పాయింట్లలో తరచూ అగ్నిప్రమాదాలు జరిగాయన్నారు. ముఖ్యంగా మోహన, ఆర్.ఉదయగిరి, నువాగడ అటవీ ప్రాంతాల్లో 2024- 25అటవీ ప్రాంతాల్లో కార్చిచ్చు నివారించడానికి యాక్షన్ ప్లాన్ అవసరమని కలెక్టర్ బిజయకుమార్ దాస్ అన్నారు. అటవీ ప్రాంతాల్లో కార్చిచ్చు వల్ల అనేక విలువైన అటవీ సంపదతో పాటు వన్యప్రాణులు అగ్నికి ఆహుతి అవుతున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో కార్చిచ్చు ఆపడానికి తగు చర్యలను అధికారులు వివరించారు. అటవీ ప్రాంతాల్లో దగ్గరలోని పంచాయతీ సర్పంచులు చొరవ తీసుకుని అగ్నిప్రమాదాల నివారణకు ఉపక్రమిస్తే వారికి తగు పారితోషికం, సత్కారం అందిస్తామని డీఎఫ్ఓ తెలిపారు.



కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదాల నివారణ సమన్వయ సమావేశానికి విచ్చేసిన ఫారెస్టు, ఇతర అధికారులు

నేవీ డే వేడుకలకు రాష్ట్రపతి రాక

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. నేవీ డే వేడుకల్లో పాల్గొనేందుకు ఆమె పర్యటన ఖరారైంది. డిసెంబరు నెల 4న పూరీ బ్లూ ఫ్లాగ్ తీరంలో నేవీ దినం వేడుకల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకల్లో ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ సందర్భంగా డిసెంబరు నెల 3 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రపతి రాష్ట్రంలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా సొంత జిల్లా మయూర్‌భంజ్ సందర్శిస్తారు. వచ్చే నెల 3న స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుతారు. మర్నాడు పూరీ సాగర తీరంలో జరగనున్న నేవీ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా పాలుపంచుకుంటారు. అదే రోజు స్థానిక ఒడిశా వ్యవసాయ సాంకేతిక విశ్వ విద్యాలయం ఓయూఏటీ 40వ కాన్వొకేషను కార్యక్రమంలో పాల్గొంటారు. డిసెంబరు నెల 5న కొత్త జుడిషియల్ కోర్టు సముదాయం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభిస్తారు. మర్నాడు కోల్‌కత్తా మీదుగా ఆమె సొంత జిల్లా మయూర్‌భంజ్ చేరుతారు. కోల్‌కతా డిఫెన్సు ఎయిర్ బేస్ నుంచి ప్రత్యేక హెలికాప్టరులో మయూర్‌భంజ్ రొంగొమటియా వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక హెలిప్యాడ్‌లో దిగుతారు. రోడ్డు మార్గంలో దళిత గ్రామం ఉప్పొరొబెడా చేరుతారు. ఈ ప్రాంతంలో రాష్ట్రపతి విద్యాభ్యాసం పొందిన ప్రభుత్వ పాఠశాల సందర్శించి అక్కడి ఉపాధ్యాయులు, బాలలతో ప్రత్యక్షంగా సంభాషించి కాసేపు ముచ్చటగా కాలక్షేపం చేస్తారు. రాయరంగపూర్ తన సొంత ఇంటిలో ఆరోజు మధ్యాహ్న భోజనం చేస్తారు. స్వగ్రామం ఆస్పత్రిలో అంబులెన్సు వాహన సేవల్ని రాష్ట్రపతి ప్రారంభిస్తారు. అనంతరం రాయరంగపూర్ మహిళా కళాశాల సందర్శన పురస్కరించుకుని విద్యార్థినులతో సంభాషిస్తారు. అక్కడి పుణేశ్వర ఆలయంలో రాష్ట్రపతి ప్రత్యేక పూజాదుల్లో పాల్గొంటారు. కార్యక్రమాలు ముగియడంతో సొంత ఇంటికి చేరి రాత్రి బస చేస్తారు. మరుసటి రోజు ఉదయం స్థానికులతో కలిసి మెలిసి కాసేపు గడిపి దండబోష్ ఎయిర్ స్ట్రిప్ నుంచి వాయు మార్గంలో బంగిరిపొషి చేరుతారు. ఆ ప్రాంతంలో 3 రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్రపతి శంకు స్థాపన చేస్తారు. వీటిలో బాదం పహాడ్ - కెంజొహార్‌గొడా, బంగిరపొషి - గోరుమొహిషాని మరియు బురామరా - చకులియా రైలు ప్రాజెక్టులు ఉన్నాయి. వీడియో కాన్ఫరెన్స్‌లో దళిత పరిశోధన కేంద్రం నిర్మాణం, దండబోష్ ఎయిర్ స్ట్రిప్, సబ్ ఆస్పత్రి అభివృద్ధికి శంకు స్థాపన చేస్తారు. కార్యక్రమాలు ముగించుకుని కోల్‌కతా డిఫెన్సు ఎయిర్ బేస్ నుంచి ప్రత్యేక విమానంలో న్యూ ఢిల్లీకి తిరిగి వెళ్తారు.

అటవీ శాఖ సిబ్బంది సస్పెన్షన్



దుర్మరణం పాలైన ఏనుగులు(ఫైల్)

భువనేశ్వర్: ఆహార అన్వేషణలో విద్యుదాఘాతానికి గురై మూడు ఏనుగులు దుర్మరణం పాలయిన ఘటనలో ముగ్గురు అటవీ శాఖ క్షేత్రస్థాయి సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరో ఇద్దరు సీనియర్ అధికారులను బాధ్యులుగా పరిగణించి క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని దర్యాప్తు బృందం విభాగానికి సిఫారసు చేసింది. అలాగే వన్య ప్రాణులను చేజిక్కించుకునేందుకు విద్యుత్ తీగలు పన్నిన ముఠాకు చెందిన ముగ్గురు పోలీసులను అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. అతని కోసం స్థానిక పోలీసుల సహకారంతో గాలిస్తున్నారు.

హైకోర్టులో వ్యాజ్యం

విద్యుదాఘాతంతో ఏనుగుల గుంపు దుర్మరణం విచారకర ఘటనపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్వచ్ఛందంగా స్పందించింది. ఈ సంఘటనపై హైకోర్టు స్వయంగా ప్రజాహిత వ్యాజ్యం ప్రతిపాదించింది. ఈ వ్యాజ్యం విచారణకు ధర్మాసనం స్వీకరించి ప్రత్యర్థి వర్గాలకు తాఖీదులు జారీ చేసింది. వివరణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి తాఖీదులు జారీ చేసింది.

ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యం 94.37 మెట్రిక్ టన్నులు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కద్రక, హికక, సరస్వతి, కలెక్టర్ పట్వారి

రాయగడ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 94.37 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ ఫరూల్ పట్వారి అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణ పై అధికారులు, మిల్లర్లు, రైతులతో ఆమె మంగళవారం సమీక్షించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల కష్టాలను తెలుసుకున్న ప్రభుత్వం ప్రతి క్వింటాల్ ధాన్యంకు ఇన్‌పుట్ సహకారంతొ అదనంగా మరో రూ.800 చెల్లించాల్సి ఉందని అన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో గల 11 సమితుల్లో 21504 మంది రైతుల ఇప్పటికే తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఆమె వివరించారు. ధాన్య భాండాగారంగా గుర్తింపు పొందిన పద్మపూర్ సమితిలో అత్యధికంగా 3752 మంది రైతులు నమోదు చేసుకున్న వారిలో ఉన్నట్లు ఆమె తెలిపారు. ధాన్యం సేకరణ వచ్చే ఏడాది మార్చి 31 వరకు కొనసాగుతుందని ప్రకటించారు. సమావేశంలో రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, సబ్ కలెక్టర్ (రాయగడ)కళ్యాణిసంఘమిత్రాదేవి, సబ్ కలెక్టర్ (గుణుపూర్) సహాట తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైతులు, మిల్లర్లు, అధికారులు

విద్యార్థుల మేధాశక్తికి ప్రదర్శనలు అవసరం



విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: విద్యార్థుల మేధాశక్తికి పదునుపెట్టేలా విధంగా విజ్ఞాన ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని కల్యాణసింగుపూర్ అటవీ శాఖ రేంజర్ చందన్ గొమాంగో అన్నారు. జిల్లాలోని కల్యాణసింగుపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన విజ్ఞాన ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను కనబరిచేందుకు ఇలాంటివి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. సమితిలో గల వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 80 ప్రాజెక్టులను ప్రదర్శించారు. సమితి ఏబీఈఓ మోహనరావు కొండగిరి తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రదర్శనకు బహుమతులను అందజేశారు.

బిసంకటక్ సమితి వైస్ చైర్మన్‌పై కేసు నమోదు



పోలీస్ స్టేషన్‌లో పట్నాయక్ పై కేసు నమోదు చేస్తున్న ఆదివాసీ నాయకులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న దేవి ప్రసాద్ పట్నాయక్ పై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బిసంకటక్‌లో గల ఆదివాసీ ఉన్నయన పరిషత్ తరఫున సోమవారం సాయంత్రం ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదవ్వడం విశేషం. ఆదివాసీ ఉన్నయన పరిషత్‌కు చెందిన అంగద్ కుట్రుక, సహకార్యదర్శి అభికలకల నేతృత్వంలో ఆదివాసీలు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పట్నాయక్ పై కేసు వేశారు. ఈ నెల 15వ తేదీన దేవి పట్నాయక్ తన వ్యక్తిగత ఫేస్‌బుక్‌లో ఈ ప్రాంతానికి చెందిన ఆదివాసీలు ఎందుకూ పనికిరాని దద్దమ్మలని పోస్టు చేశారు. ఈ పోస్టు వైరల్ కావడంతో దీనిపై స్పందించిన ఆ ప్రాంత ఆదివాసీ ఉన్నయన పరిషత్‌కు చెందిన అధ్యక్షులు ఈ మేరకు కేసు నమోదు చేశారు. అది పొరపాటును పోస్ట్ అయ్యిందని, వెంటనే డిలీట్ చేశానని ఆయన అన్నారు. దీనిపై ఆదివాసీ నాయకులతో మాట్లాడతానన్నారు.

సహకార సంఘాలతోనే రైతుల ప్రగతి



పర్లాకిమిడిలో భారతీయ సహకార సంఘాల వారోత్సవాల మహోత్సవం ప్రారంభిస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్



జిల్లా స్థాయి సహకార సంఘాల వారోత్సవాల మహోత్సవానికి విచ్చేసిన డైరెక్టర్లు, రైతులు

పర్లాకిమిడి: రైతుల ఆర్థిక, సామాజికాభివృద్ధికి సహకార సంఘాలు దోహదపడతాయని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్.ఆర్.ఫంక్షన్ హాలులో జరిగిన 72వ భారతీయ సహకార సంఘాల వారోత్సవాల్లో కలెక్టర్ దాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు ఎస్పీ జితేంద్రనాథ్ పండా, ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, సబ్ కలెక్టర్ అనూప్ పండా, బరంపురం కోపరేటివ్ సొసైటీల అధికారి నృసింహాచరణ్ బెహరా, జిల్లా వ్యవసాయ అధికారి రాంప్రసాద్ పాత్రో, నాబార్డు ఏజీఎం ప్రతీక్ పండా తదితరులు హాజరయ్యారు. రైతులు అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యక్తుల వద్ద పరపతి వాడే కంటే, ప్రభుత్వ సహకార పరపతి వద్ద స్వల్పకాలిక రుణాలు తీసుకుంటే మంచిదని కలెక్టర్ దాస్ ఉద్బోధించారు. అనంతరం జెడ్పీటీసీ ఎస్.బాలరాజు మాట్లాడుతూ, ఈ ఏడాది రైతులు ఖరీఫ్ ధాన్యం మండీల వద్దే విక్రయాలు జరిపి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర తీసుకోవాలన్నారు. సహకార పరపతి సంఘాలు, రైతులకు అవినాభావ సంబంధం ఉందని బాలరాజు అన్నారు. స్వల్పకాలిక పరపతి సంఘాల రుణాలు తీసుకుని పంపుసెట్లు, బోరుబావులు తవ్వించుకుని రైతులు లాభదాయకమైన పంటలు పండించవచ్చని సబ్ కలెక్టర్ అనుప్ పండా అన్నారు. జిల్లాలో 87 సహకార పరపతి సంఘాలు ఉన్నాయని, వాటి ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూడా ఈ ఏడాది ఖరీఫ్ పంట విక్రయం చేసుకోవచ్చని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. ఈ సందర్భంగా గత 35 ఏళ్లుగా బరంపురం కో ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు, ప్రస్తుత అర్బన్ బ్యాంకు డైరెక్టర్ అభిమన్యుపండా, బరంపురం కో ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్, ఆర్.యం.సి.యస్. డైరక్టరు కోడూరు కిరణ్ కుమార్, తంపరకవిటి సొసైటీ డైరెక్టర్ గేదెల శ్రీధరనాయుడుని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా భాజపా కృషక్ మోర్చా అధ్యక్షులు ప్రశాంత పాలో తదితరులు కూడా మాట్లాడారు.

వన్డే మ్యాచ్ టికెట్ ధరలు తగ్గింపు



మంత్రి అధ్యక్షతన క్రీడా విభాగం, ఓసీఏ అధికారుల సమావేశం

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న వన్డే క్రికెట్ మ్యాచ్ టికెట్ ధరల్ని తగ్గించినట్లు రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి సూర్య వంశీ సూరజ్ మంగళ వారం ప్రకటించారు. స్థానిక కళింగ స్టేడియంలో మంత్రి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెల 9వ తేదీన కటక్ బారాబటి స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య వన్డే క్రికెట్ మ్యాచ్ జరగనుంది. క్రీడా విభాగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఒడిశా క్రికెట్ అసోసియేషన్ ఓసీఏ అధికార వర్గాలు, రాష్ట్ర క్రీడా విభాగం అధికారులు సమావేశమై చర్చించారు. లోగడ ఒడిశా క్రికెటు అసోసియేషను నిర్ధారించిన భారత్, ఇంగ్లండు వన్డే క్రికెటు మ్యాచ్ టికెటు ధరల్ని తగ్గించాలని నిర్ణయించారు. న్యూ పెవెలియన్, కార్పొరేటు బాక్సు టికెట్లు మినహా ఇతర వర్గాల టికెటు ధరల్ని తగ్గించారు. ఈ నిర్ణయం ప్రకారం మ్యాచ్ టికెటు తాజా ధరల వివరాలిలా ఉన్నాయి.

- ✔ 1, 3వ నంబరు గ్యాలరీ టికెటు ధరని రూ. 12 వేల నుంచి రూ. 11 వేలకు తగ్గించారు.
- ✔ 2, 4వ నంబరు గ్యాలరీ టికెటు ధరని రూ. 1,000 నుంచి రూ. 900కి తగ్గించారు.
- ✔ 5వ నంబరు గ్యాలరీ ధరని రూ. 1,500 నుంచి రూ. 1,200కి, 7వ నంబరు గ్యాలరీ టికెటు ధరని రూ. 800 నుంచి రూ. 700కి తగ్గించారు.
- ✔ ఎన్‌క్లోజరు టికెటు ధరని రూ. 8 వేలు నుంచి రూ. 7 వేలకి తగ్గించారు.
- ✔ ఎయిర్ కండిషన్ గ్యాలరీ బాక్సు టికెటు ధరని రూ. 9 వేల నుంచి రూ. 8 వేలకి తగ్గించారు.
- ✔ లోగడ ఒడిశా క్రికెటు అసోసియేషను నిర్ధారించిన న్యూ పెవెలియన్ టికెటు ధర రూ. 10 వేలు, కార్పొరేటు బాక్సు టికెటు ధర రూ. 20,000గా కొనసాగుతుంది.

క్లుప్తంగా

రోగాలపై అప్రమత్తత అవసరం


ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ కల్యాణి, డాక్టర్ పాడి

రాయగడ: రోగం సంక్రమించక ముందే అప్రమత్తతతో వ్యవహరించాలని సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రాదేవి అన్నారు. జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక సెంచూరియన్ ఫార్మసీ విభాగానికి చెందిన విద్యార్థులు మంగళవారం నిర్వహించిన అవగాహనర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక గజపతి కూడలి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ జీసీడీ మైదానం వరకు కొనసాగింది. సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగానికి చెందిన డాక్టర్ చంద్ర శేఖర్ పాత్రో, అధ్యాపకులు గోపాలకృష్ణ పాడి, అవినాష్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు బాధితులకు పరిహారం ఇస్తాం


కాశీనగర్ బ్లాక్ జైగుడ వద్ద తిష్టవేసిన ఏనుగుల గుంపు

పర్లాకిమిడి: కాశీనగర్ సమితిలోని జైగుడ గ్రామంలో నాలుగు అటవీ ఏనుగులు సంచరిస్తున్నట్టు జిల్లా అటవీశాఖ అధికారి సుబ్రహ్మణ్యం ఆనంద్ తెలిపారు. కాశీనగర్‌లో ఏనుగుల సంచారంపై ట్రాక్ చేస్తూ, టాటా విద్యుత్ శాఖ సిబ్బందితో కలిసి జాయింట్ ఆపరేషన్ చేపడుతున్నామని ఆయన అన్నారు. ఏనుగులు పంట పొలాలు నాశనం చేస్తున్నాయన్న ఫిర్యాదులపై డీఎఫ్ఓ ఆనంద్ స్పందిస్తూ దీనిపై పంట నష్టపరిహారం అంచనాలు వేస్తున్నామని, 45 రోజుల్లోగా నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు.


మత్స్య, ప్రాణి సంపద మేళా ప్రారంభం


రైతులకు సన్మాన పత్రాలు అందిస్తున్న కలక్టర్ పట్వారి


మేళా స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కద్రక, హికక

రాయగడ: స్థానిక రైల్వే గ్రౌండ్‌లో మంగళవారం జిల్లా స్థాయి మత్స్య, ప్రాణి సంపద మేళా ప్రారంభమైంది. రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక ముఖ్యఅతిథిగా హాజరై మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో వలలు దగ్ధం


కాలిపోతున్న వలలు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని డి.మత్స్యలేశం పంచాయతీ కొత్తదిబ్బలపాలెం సముద్ర తీరంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో చేపల వలలు దగ్ధమయ్యాయి. ఉదయం 11.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ప్లాస్టిక్ తాళ్లతో ఉన్న వలలకు నిప్పంటుకోవడంతో మంటలు అదుపు చేయలేకపోయారు. సమాచారం అందుకున్న శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ఘటనలో వలలు కాలిపోవడంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత మత్స్యకారులు చీకటి పండువాడు, రాము, సూరాడ కూర్మయ్య, కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గత అక్టోబర్ 21న డి.మత్స్యలేశం తీరంలోనూ ఇలాగే వలలు కాలిపోయినా ఎందుకు ప్రమాదం జరిగిందో కారణం తెలియలేదు. ప్రమాదమా? వ్యక్తిగత కక్షలతో నిప్పుదు పెడుతున్నారా అన్నది తెలియడం లేదు.

23 ఎకరాల్లోని గంజాయి పంట దహనం


బొయిపరిగుడ ప్రాంతాల్లో విస్తారంగా పండిస్తున్న గంజాయి


గంజాయి పంటలపై దాడులు జరిపిన అధికారులు


తగులబడుతున్న గంజాయి మొక్కలు

జయపురం: బొయిపరిగుడ సమితి జి.మఝిగుడ పంచాయతీ కాత్రగుడ, బంసుయగుడ, బంశుగుడ గ్రామాల ప్రాంతాల్లో 23 ఎకరాల్లో రైతులు పండించిన గంజాయి పంటను పోలీసులు గుర్తించి దహనం చేసినట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలీ ప్రధాన్ మీడియాకు తెలిపారు. 23 ఎకరాల్లో 22,0300 గంజాయి మొక్కలను కాల్చివేసినట్లు వెల్లడించారు. జిల్లా వలంటరీ సురక్షా ఫోర్స్ సహకారంతో జరిగిన దాడుల్లో బొయిపరిగుడ పోలీసులు జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ, మెజిస్ట్రేట్ బాధ్యతలు నిర్వహిస్తున్న బొయిపరిగుడ అదనపు తహసీల్దార్ ఖొగేశ్వర సొరలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలీ ప్రధాన్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి గంజాయి మాఫియా బొయిపారిగుడ సమితిలో స్థావరాలు ఏర్పరుచుకొని ఆదివాసీలను ప్రలోభ పరచి గంజాయి సాగు చేయిస్తున్నారని వెల్లడించారు. త్వరలోనే అలాంటి వారిని అరెస్టు చేస్తామని తెలిపారు.

గంజాయి మొక్కలు ధ్వంసం


గంజాయి మొక్కలు తగులబెడుతున్న పోలీసులు


గంజాయి వనాలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

రాయగడ: గంజాయి అక్రమ రవాణా, సాగుపై జిల్లా పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. దీనిలో భాగంగా పద్మపూర్ పంచాయతీ సుందర్‌పూర్, తొటలపండ, నువాగా అటవీ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు లేకుండా సాగు చేస్తున్న గంజాయి వనాలపై పోలీసులు సోమవారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ మూడు ప్రాంతాల్లో సుమారు 32 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు.

15 ఎకరాల్లో గంజాయి ధ్వంసం


గంజాయి కుప్పను కాలుస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి నూవగూఢ పంచాయతీ శీలిపాక గ్రామంలో 15 ఎకరాల్లో గంజాయిని చిత్రకొండ ఎక్సైజ్ పోలీసులు, డీవీఎఫ్ జవాన్లు మంగళవారం కాల్చివేశారు. ఎవరైనా గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.20వేలకు పసికందు విక్రయం

- దర్యాప్తు ప్రారంభించిన వైద్య శాఖ


నువాపడ ప్రాంతంలో దర్యాప్తు చేస్తున్న సీడబ్ల్యూసీ సిబ్బంది


ఆడశిశువును విక్రయించిన దంపతులు

రాయగడ: పేగు తెంచుకుని పుట్టిన పసికందును తొమ్మిది రోజుల వయసులోనే రూ.20వేలకు అమ్మేసిన ఉదంతం వెలుగుచూసింది. సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి జిల్లా ఆరోగ్య శాఖ దర్యాప్తు చేపట్టింది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గల నువాపడ బస్తీలో నివసిస్తున్న కుముదుని గంట, రాహుల్‌లు దంపతులు. గర్భవతి అయిన కుముదుని ఈ నెల 3 వ తేదీన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, పిల్ల క్షేమంగా ఉండటంతో వారిని వైద్యులు ఇంటికి పంపించారు. అయితే ఈ దంపతులకు అప్పటికే ఒక మూడేళ్ల ఆడపిల్ల ఉండటంతో పాటు ఆర్థిక కష్టాలు ఉన్నాయి. దీంతో వారు మధ్యవర్తుల సాయంతో మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన పెదపెంకి ప్రాంతంలో నివసిస్తున్న కె.రాజశేఖర్ దంపతులకు కేవలం రూ.20 వేలకు బిడ్డను విక్రయించారు. విషయం ఆలస్యంగా బయటకు తెలిసింది. దీంతో సీడబ్ల్యూసీకి చెందిన ప్రియదర్శిని మహాంకుడో మరికొంతమంది సిబ్బంది మంగళవారం నువాపడ ప్రాంతనికి వెళ్లి దర్యాప్తు చేశారు. తమ బిడ్డను విక్రయించినట్లు వారు ఒప్పుకున్నారు.

డీజీఎం సుబాష్ పండా అరెస్టు



భువనేశ్వర్: రాష్ట్ర విజిలెన్స్ పోలీసులు ఒడిశా పోలీసు హౌసింగ్ బోర్డు డిప్యూటీ జనరల్ మేనేజరు సుబాష్ పండాని మంగళవారం అరెస్టు చేశారు. అక్రమ ఆస్తుల ఆర్జన ఆరోపణ ఆధారంగా సోమవారం సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో 2 బహుళ అంతస్తు భవనాలు, 1 ఫ్లాటు, 870 గ్రాములు బంగారం, 5 ఇళ్ల స్థలాలు, నగదు రూ. 13 లక్షల 50 వేలు, పొదుపు, పెట్టుబడుల్లో రూ. 1 కోటి 80 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. వీటి సమగ్ర విలువ ఆదాయం కంటే 303 శాతం అధికంగా లెక్క తేలింది.

తల లేని మృతదేహంలో కేసులో ఆరుగురు అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ 57 గ్రామంలో నదిలో బస్తాలో కట్టి పడేసిన మృతదేహాన్ని గత గురువారం కలిమెల పోలీసులు గుర్తించారు. ఈ మృతదేహానికి తల లేదు. దర్యాప్తులో మృతుడు సుర్లుకొండ గ్రామానికి చెందిన పదియా మడ్కమి (47)గా తెలిసింది. ఇతను చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో ఆరుగురు వ్యక్తులు పొలంలో నిద్రపోతున్న సమయంలో తల నరికేసి తలలో పడేసినట్లు దర్యాప్తులో ప్రాథమికంగా తెలుస్తోంది. నిందితులైన సోడి పోడియామి, రామ పోడియామి, మున్న పోడియామి, ఇర్మా పోడియామి, పధలం పోడియామి, రామ కావసీలను మంగళవారం సుర్లుకొండ గ్రామంలో అరెస్టు చేసి కలిమెల పోలీస్‌స్టేషన్‌కు తెచ్చారు. ఈనెల 8న హత్య చేసినట్లు నిందితులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: నలుగురికి గాయాలు


రహదారిపై పడిపోయి కాలు విరిగిన గంగ పోడియమి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ 79 పోలీసు స్టేషన్ పరిధిలో గల ఎంవీ 126 గ్రామం వద్ద ఈ రోజు మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో రెండు బైక్‌లు ఢీకొని నలుగురు గాయపడ్డారు. కనిమెట్ల గ్రామానికి చెందిన గంగా పోడియామి, కార్తీక్ పోడియామిలు ఒక బైక్‌పై వస్తున్నారు. మోటు వైపు నుంచి భీమా మధిర, నీల్ మధిర అనే ఇద్దరు మరో బైక్‌పై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. స్థానికులు చూసి వీరిని అంబులెన్స్ సాయంతో కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మల్కన్‌గిరి తరలించారు. ఐఐసీ చంద్రకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.


తుప్పల్లో పడిపోయిన నీల్ మధిరి

ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి


పాటలతో ఉర్రూతలూగించిన విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న శౌశ్య రెడ్డి


మేరా భారత్ గీతానికి డాన్స్ చేస్తున్న విద్యార్థులు

జయపురం: ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యం ఏర్పరుచుకోవాలని జయపురం సబ్ కలెక్టర్ ఎ.శౌశ్యా రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక నేహ్రూనగర్ జయపురం సిటీ ఉన్నత పాఠశాల శిశు ఉత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల హెచ్‌ఎం బి.సుజాత అధ్యక్షతన జరిగిన శిశు ఉత్సవంలో ఆమె మాట్లాడుతూ తాము ఏమీ సాధించాలో విద్యా దశలోనే లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. సాధించాలన్న పట్టుదల, కార్యదీక్ష ఉన్న నాడే గమ్యాన్ని చేరగలమన్నారు. శిశు ఉత్సవంలో పాఠశాల నిర్వాహకులు వివిధ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన నృత్య, నాట్య ప్రదర్శనలు, చిన్నారుల విచిత్ర వేషధారణలు, పాటలు ఆకట్టుకున్నాయి. ఇటీవల పాఠశాల యాజమాన్యం నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు సబ్ కలెక్టర్ బహుమతులు అందజేశారు. కమిటీ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు శశిపట్నాయక్, తెలుగు సంస్కృతిక సమితి అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినుల ఆదివాసీ నృత్యం

25 వేల మంది సభ్యత్వమే లక్ష్యం


ప్రసంగిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రమేష్ మఝి

కొరాపుట్: నబరంగ్‌పూర్ విధాన సభ స్థానంలో బీజేడీలో 25 మందిని సభ్యులుగా చేర్చాలనే లక్ష్యంగా పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రమేష్ చంద్ర మఝి పిలుపునిచ్చారు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో డొంబురు మఝి కళ్యాణ మండపంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సభ్యులను చేర్చాలని సూచించారు. గత 25 ఏళ్లుగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. ప్రస్తుత పాలకులు పేద ప్రజల పట్ల చూపుతున్న నిర్లక్ష్యం వైఖరిని ఎత్తిచూపాలన్నారు. పార్టీ నాయకులు ప్రతిప్ మఝి, సదాశివ ప్రధాని తదితరులు ప్రసంగించారు.


హాజరైన కార్యకర్తలు

ఏహెచ్‌పీ లబ్ధిదారులకు కేటాయింపు పత్రాల పంపిణీ


లాటరీలో అర్హత సాధించిన వారికి కేటాయింపు పత్రాల పంపిణీలో మంత్రి కృష్ణ చంద్ర మహాపాత్రో

భువనేశ్వర్: నగరంలో సరసమైన గృహ ప్రాజెక్టు కింద లబ్ధిదారులకు రాష్ట్ర గృహ నిర్మాణం, నగర అభివృద్ధి విభాగం మంత్రి డాక్టరు కృష్ణ చంద్ర మహాపాత్రో కేటాయింపు పత్రాలు పంపిణీ చేశారు. స్థానిక ఇడ్కో ఆడిటోరియంలో మంగళ వారం జరిగిన లాటరీ కార్యక్రమంలో అర్హులైన వారికి మంత్రి ఈ పత్రాల్ని ప్రత్యక్షంగా అందజేశారు. రాజధాని నగరంలో ఇల్లు కలిగి ఉండడం సామాన్యునికి అతి పెద్ద కల. ప్రభుత్వం సగటు మనిషి కలని సాకారం చేసే దిశలో ఈ చర్యపట్ల చొరవ తీసుకున్నట్లు మంత్రి ప్రసంగంలో పేర్కొన్నారు. చంద్రశేఖర పూర్, నీల మాధవ్ ఆవాస్, సుబుద్ధి పూర్ ప్రాంతాల్లో సరసమైన గృహ ప్రాజెక్టు పథకం నగర బీదల కోసం ప్రత్యేకంగా ఇళ్ల నిర్మాణం సాగుతుంది. ఈ ప్రాజెక్టుల కింద సమగ్రంగా 116 మందికి మంత్రి కేటాయింపు పత్రాలు అందజేశారు. చంద్రశేఖర పూర్ ప్రాంతంలో 47, నీల మాధవ్ ఆవాస్ ప్రాజెక్టు కింద 36, సుబుద్ధి పూర్ ప్రాంతంలో 28 ఇళ్లకు సంబంధించి కేటాయింపు పత్రాలు జారీ చేయడం పూర్తయ్యింది.
చంద్రశేఖర పూర్ ప్రాంతం 20 ఎకరాల విస్తీర్ణంలో 2,600 ఇళ్ల నిర్మాణం చేపట్టి 820 నిర్మాణాలు పూర్తి చేశారు. వీటిలో 737 మందికి అర్హులుగా పరిగణించి కేటాయింపు లేఖలు అందజేశారు.

స్థానిక కేర్ ఆస్పత్రి చేరువలో నీల మాధవ్ ఆవాస్ ప్రాజెక్టు కింద 8.18 డెసిమల్ విస్తీర్ణపు స్థలంలో చేపట్టిన 1,200 ఇండ్ల నిర్మాణంలో 960 ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి 543 మంది అర్హులకు అందజేశారు. సుబుద్ధి పూర్ బరుణై ఎంక్లేవ్ ప్రాజెక్టు కింద 342 ఇండ్లు నిర్మించడం లక్ష్యంగా పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు కింద 28 ఇళ్ళ నిర్మాణం పూర్తి కావడంతో అర్హులైన లబ్ధిదారులకు కేటాయించారు. స్థానిక సత్య నగర్ ప్రాంతం 10 ఎకరాల సువిశాల విస్తీర్ణపు స్థలంలో కేశరి రెసిడెన్సీ బీదల వాడ పునరాభివృద్ధి ప్రాజెక్టు ప్రారంభించారు. ఈ స్థలంలో 1,300 ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా 560 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి 454 మంది లబ్ధిదారులకు కేటాయించారు.

ఆంగ్లం విశ్వ భాష

– విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్


మాట్లాడుతున్న మంత్రి నిత్యానంద గోండ్

జయపురం: ఇంగ్లిస్ విశ్వ భాష అని పాఠశాల, విద్యా విభాగశాఖ మంత్రి నిత్యానంద గోండ్ అన్నారు. మంగళవారం స్థానిక నేహ్రూనగర్ సిటీ ఉన్నత పాఠశాల సభా గృహంలో ఐదురోజుల ఇంగ్లిష్ భాష ఎన్రిచ్‌మెంట్ కోర్సు శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంగ్ల భాషను మనం మాట్లాడగలుగుతున్నాం, కానీ అనర్గళంగా మాట్లాడేందుకు కష్టపడుతున్నామన్నారు. విద్యార్థులకు ఆంగ్ల భాషలో పాఠ్యాంశాలు బోధించటంలో సమస్యలు ఏర్పడుతున్నాయని, అందువలన ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వటం జరుగుతునందని వెల్లడించారు. శిక్షణ పొందే ఉపాధ్యాయులు చక్కగా ఇంగ్లిష్ బోధించాలన్నారు. జిల్లా విద్యాధికారి ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ.. ఐదు రోజులు జరుగనున్న శిక్షణలో కొరాపుట్, రాయగడ, గజపతి జిల్లాల ఉన్నత, ప్రాథమిక పాఠశాలల నుంచి 52 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారని వెల్లడించారు. వారికి క్షీరబ్ కుమార్ బొటమిత్ర, పార్థసారధి పండా, దుర్యోధన ముదులి, సౌమ్యప్రసాద్ నాయక్, దేవేంద్ర కుమార్ దొర, రమేష్ చంద్ర సాహు, జయప్రకాశ్ మిశ్ర శిక్షణ ఇస్తారన్నారు. నవరంగపూర్ ఎమ్మెల్యే గౌరీశంకర మఝి, కార్యక్రమ కో ఆర్డినేటర్ చంద్ర కళా బొగర్తి, విక్రమదేవ్ విశ్వవిద్యాలయ అధ్యాపకులు మనోరంజన్ ప్రదాన్, సిటీ హైస్కూల్ హెచ్‌ఎం బి.సుజాత, తదితరులు పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నిధులు కేటాయించండి


భువనేశ్వర్‌లో జయపురం మున్సిపాలిటీ కౌన్సిల్ బృందం


పట్టణాభివృద్ధి మంత్రి కృష్ణ చంద్ర మహంతికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్ తదితరులు

జయపురం: జయపురంలో చారిత్రిక జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణ పనులలో మున్సిపల్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే, మునిసిపాలిటీ అధికారులు కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత నేతృత్వంలో బీజేడీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు కలిసి నిధుల కోసం రాజధాని భువనేశ్వర్‌కు మంగళవారం వెళ్లారు. జగన్నాథసాగర్ పనులు నిలిచిపోవటం వలన ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర గృహ, పట్టణాభివృద్ధి విభాగ మంత్రి కృష్ణ చంద్ర మహాపాత్రోను జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతితో కలిసి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్, తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర గృహ, పట్టణాభివృద్ధి విభాగ ప్రధాన కార్యదర్శి ఉషా పాడిని కలిసి జగన్నాథ్ సాగర్ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బీజేడీ కౌన్సిలర్లు మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్‌ను కలిసి జయపురం జగన్నాథ్ సాగర్ పురుద్ధరణ కోసం నిధులు వెంటనే విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మహంతి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మారిన తరువాత జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణకు నిదులు విడుదల చేస్తారని ఆశించామని, నేటివరకు నిధులు రాలేదని వెల్లడించారు. పునురుద్ధరణ పనులు నిలిచిపోయాయని, అందువల్ల తామంతా భువనేశ్వర్ వచ్చామన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించండి


బొరిగుమ్మ ప్రజాభియోగ శిబిరంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితిలో మంగళవారం కలెక్టర్ వి.కీర్తి వాసన్ నిర్వహించిన ప్రజాభియోగ శిబిరంలో 40 ఫిర్యాదులు అందినట్లు బొరిగుమ్మ అధికారులు వెల్లడించారు. ఈ ఫిర్యాదులలో వ్యక్తిగతమైనవి 13, కమ్యూనిటీకి చెందినవి 27 వచ్చాయన్నారు. బొరిగుమ్మ సమితి ఇంజినీర్‌పై కుచులి గ్రామం ప్రతాపహోత్త ఫిర్యాదు చేశారు. హోర్డిలి గ్రామంలో ఉన్నత పాఠశాల ప్రాంతంలో సమితి తరఫున నూతన గృహం నిర్మించామని, నిర్మాణం పూర్తయి 3 ఏళ్లు గడచినా ఇంజినీర్ గుప్త దాస్ డబ్బు చెల్లించలేదని ఫిర్యాదులో ఆరోపించారు. తెలింగిరి డ్యామ్ నీరు కొద్ది రోజుల్లో బయటకు పోయి ఖాళీ అవుతుందని, సాగునీటి సమస్య పరిష్కరించాలని పోడాపాదర్ గ్రామం చిత్ర సేన్ నేతృత్వంలో రైతులు కోరారు. ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులతోపాటు అదనపు బీడీఓ మాధురీ ఆచారి, ఏఈ ప్రకాశ్ ప్రధాన్, బీఈఓ సచిన్ కుమార్ మల్లిక్, సీడీపీఓ గాయత్రీ బాహినీపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరిపంట దగ్ధం


దగ్ధమైన వరికుప్పలు

బలిజిపేట: మండలంలోని కూర్మనాథపురం రెవెన్యూ పరిధిలో గల 52సెంట్ల భూమిలో వరిపంట ప్రమాదవశాత్తు మంగళవారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన బి.లక్ష్మణరావు భూమిలో సుమారు రూ.30వేల విలువైన పంటకు నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నష్టాన్ని పరిశీలించి నివేదిక తయారుచేసి అధికారులకు అందించనున్నట్లు వీఆర్‌ఓ స్వామినాయుడు చెప్పారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

రాజాం సిటీ: మండల పరిధి సోపేరు గ్రామానికి చెందిన కోటగిరి మధు (48) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై ఎస్సై నర్సింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మధు కొన్నేళ్లుగా కాళ్లుచేతులు పనిచేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. కాలకృత్యాలు కూడా తీర్చుకోలేని స్థితిలో తీవ్రమనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెందాడు. ఈ నేపథ్యంలో వ్యవసాయం నిమిత్తం ఇంట్లో ఉంచిన పురుగుమందును ఈ నెల 18న తాగేశాడు. విషయం గమనించిన కుటుంబసభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటిన తరువాత మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుని సోదరుడు అశోక్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రూ.50వేల నగదు చోరీ

గుర్ల: మండలంలోని పాలవలస గ్రామంలో మంగళవారం దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన తాడ్డి గౌరినాయుడు ఇంట్లో దొంగలు పడి బీరువాను పగలగొట్టారు. బీరువాలో బంగారు అభరణాలు ఉన్నప్పటికీ సుమారు రూ.50 వేల నగదు అపహరించినట్లు గౌరినాయుడు కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఈ దొంగతనంపై బాధితులు గుర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై పి.నారాయణ రావు కేసు నమోదు చేశారు. క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు సేకరించారు. విచారణ చేసి నిందితులను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో మరో నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: గంజాయి కేసులో మరో నిందితుడ్ని అరెస్టు చేసినట్లు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్వారపూడి గ్రామశివారులో ఇటీవల ముగ్గురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా ఈనెల 12న వారిని అరెస్టు చేశామని, పరారీలో ఉన్న మరో నిందితుడు భువనేశ్వర్‌కు చెందిన రాజేష్ బాగ్‌ను విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద సోమవారం రూరల్ సీఐ బి.లక్ష్మణరావు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిందితుడి దగ్గర నుంచి రెండు కిలోల గంజాయిని, రూ.210 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలియజేశారు. కేసులో క్రియాశీలకంగా పనిచేసిన సీఐ లక్ష్మణరావు, ఎస్సై వి.అశోక్ కుమార్‌లను డీఎస్పీ అభినందించారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

విజయనగరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 60 శాతం పోస్టు మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను బ్యాంకు ఖాతాల్లో జమచేసేందుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రామానందం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీప గ్రామ/వార్డు సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్/వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, పోస్టాఫీస్ వారిని సంప్రదించి ఎన్‌పీసీఏ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోతే డబ్బులు జమకావన్నారు.

చెరకు టన్ను రూ.3151

- మద్దతుధర ప్రకటించిన సంకిలి ఈఐడీ చక్కెర కర్మాగారం
- ఈనెల 20 నుంచి క్రషింగ్ ప్రారంభం


వి.పట్టాభిరామిరెడ్డి

రేగిడి: మండలంలోని సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం యాజమాన్యం చెరకు రైతులకు తీపికబురు చెప్పింది. ఈ నెల 20 నుంచి చెరకు క్రషింగ్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. కర్మాగారం వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ వి.పట్టాభిరామిరెడ్డి మాట్లాడారు. ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం 2024-25 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి టన్ను చెరకుకు రూ.3,151లు మద్దతు ధర చెల్లిస్తామని వెల్లడించారు. గత ఏడాది కంటే టన్నుకు రూ.71లు పెంచినట్టు పేర్కొన్నారు. క్రషింగ్ సీజన్ అనంతరం రైతులకు ప్రోత్సహకాలు అందజేస్తామని చెప్పారు. సమావేశంలో కేన్ డీజీఎం ఆర్.రమేష్ పాల్గొన్నారు.

మిల్లు తిప్పి ఉపాధి కల్పించండి

- కార్మిక సంఘాల విజ్ఞప్తి


ఏసీఎల్‌తో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

నెల్లిమర: అక్రమ లాకౌట్‌లో ఉన్న జూట్‌మిల్లును తిప్పి కార్మికులకు ఉపాధి కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం విశాఖపట్నంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వద్ద నెల్లిమర్ల జూట్ మిల్లు సమస్యపై జాయింట్ సమావేశానికి సీఐటీయూ అనుబంధ సంఘం జూట్ మిల్ వర్కర్స్ యూనియన్ తరఫున కిల్లంపల్లి రామారావు, అప్పలనర్సయ్య, ఐఎఫ్‌టీయూ తరఫున నామాల తిరుపతి రావు, కె.అప్పల సూరి, టి.అప్పారావు, శ్రామిక సంఘం తరఫున చిక్కాల గోవింద రావు, సముద్రపు సత్య నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ గత 9సంవత్సరాలుగా జూట్‌మిల్లు యాజమాన్యం గ్రాట్యుటీ బకాయిలు ఇవ్వలేదని, అలాగే పోస్ట్ డెటెడ్ చెక్‌లు ఇచ్చి రిటైర్డ్ కార్మికులు బ్యాంకు వద్దకు వెళ్తే ఖాతాలో నగదు లేక యాజమాన్యం ఇచ్చిన చెక్‌లు బౌన్స్ అయిపోతున్నాయని తెలిపారు. అంతేకాకుండా గడిచిన 9సంవత్సరాలుగా యాజమాన్యం ఈఎస్ఐ, పీఎఫ్ నగదు కార్మికులనుంచి తీసుకుంటూ సంబంధిత అధికారులకు చెల్లించలేదని ఆరోపించారు. కార్మికులనుంచి యాజమాన్యం డెత్ ఫండ్ వసూలు చేసి రెండు, మూడు నెలల తరువాత ఆయా కుటుంబాలకు యాజమాన్యం వాటా లేకుండా ఇస్తోందన్నారు.

లాకౌట్ అన్యాయం

ముడిసరుకు కొరత విషయంలో కార్మికులు సహకరించలేదని జూట్‌మిల్లు యాజమాన్యం చెప్పడం భావ్యం కాదని కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వెలిబుచ్చారు. 1989నుంచి కార్మికులు రూ.5,రూ.10,రూ.18 కార్మికులనుంచి యాజమాన్యానికి రుణంగా ఇచ్చి సహకరించినట్లు తెలిపారు. ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొని జూట్ యాజమాన్యానికి కార్మికులు సహకరిస్తుంటే యాజమాన్యం మాత్రం ముడి సరుకు కొరత పేరిట మిల్లును అక్రమ లాకౌట్ చేసి ఉపాధి లేకుండా చేయడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి మిల్లు తిప్పి ఉపాధి కల్పించడమే కార్మిక సంఘాల లక్ష్యమని పేర్కొన్నారు. లేకపోతే మిల్లు తిప్పి ఉపాధి కల్పిస్తారా? ఇతర మిల్లుల్లా గ్రాట్యుటీ బకాయిల చెల్లింపుతో పాటు కార్మికులకు యాజమాన్యం ఇవ్వాల్సిన రూ.5, రూ.10,రూ.18 తిరిగి చెల్లించి సెటిల్‌మెంట్ చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏసీఎల్ వచ్చే నెల 17కి చర్చలు వాయిదా వేస్తున్నామని అప్పటికీ యాజమాన్యం రాకపోతే కలెక్టర్, ఉన్నాతాధికారులకు నివేదిస్తామని ఏసీఎల్ చెప్పినట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.

ఉమా జూట్‌మిల్స్ కన్సొలేషన్ మీటింగ్ వాయిదా

కొత్తవలస: మండలంలోని కోటపాడు రోడ్డు సీతంపేట సమీపంలో గల ఉమా జూట్‌మిల్స్‌ను ఈ ఏడాది జూలై-15 వతేదీన యాజమాన్యం అక్రమంగా లాకౌట్ ప్రకటించి మూసేసిన విషయం తెలిసిందే. నాటి నుంచి కార్మిక సంఘం ఎఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విజయగనరం డీసీఎల్, విశాఖపట్నం జేసీఎల్‌లు యాజమాన్యం, కార్మికులతో 9 పర్యాయాలు చర్చలు నిర్వహించినా యాజమాన్యం గైర్హాజరవుతూ వస్తోంది. దీంతో చివరిగా డిసెంబర్ 4వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించే కన్సొలేషన్ చర్చలకు యాజమాన్యం కచ్చితంగా హాజరుకావాలని జేసీఎల్ ఆదేశించినట్లు కార్మిక సంఘం అధ్యక్షుడు గణేష్ పండా మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి యాజమాన్యం హాజరు కాకపోతే కేసును ముగించి ప్రభుత్వానికి నివేదిస్తామని జేసీఎల్ స్పష్టం చేసినట్లు పండా తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న చెస్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక పూర్తయింది. ఈ మేరకు చెస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సీఈఓ కేవీ.జ్వాలాముఖి ఎంపికైన క్రీడాకారుల జాబితాను మంగళవారం ప్రకటించారు. ఇటీవల మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన పేర్కొన్నారు. పోటీలలో అండర్-6 బాలికల విభాగంలో జి.వేద సాయి శ్రీ(పీఎస్ఆర్ స్కూల్) ఎస్.ధాన్విక (భాష్యం స్కూల్) సీహెచ్.రేణుశ్రీ (చాణక్య స్కూల్).. బాలుర విభాగంలో ధీరజ్(ఫోర్ట్ సిటీ స్కూల్) యశ్విన్ (చాణక్య స్కూల్) ఎంపికై నట్లు తెలిపారు. అదేవిధంగా అండర్-8 బాలికల విభాగంలో జాష్విక(ఫోర్ట్‌సిటీ స్కూల్) అనన్య(బీసెంట్ స్కూల్)..బాలుర విభాగంలో ధనుష్(ఆదిత్య స్కూల్) హిమాంక్(ఇన్‌స్పైర్ స్కూల్), అండర్-10 బాలికల విభాగంలో అమృత(కేంద్రీయ విద్యాలయ), వైష్ణవి(ప్రభుత్వ పాఠశాల, తిమిడి), బాలుర విభాగంలో పర్వేష్(బీసెంట్ స్కూల్) జిగ్నేష్(కేంద్రీయ విద్యాలయ) ఎంపికై నట్లు పేర్కొన్నారు. అలాగే అండర్-12 బాలికల విభాగంలో సాయి ధృతి(సన్ స్కూల్) గరిమ సంస్కృతి(నేషనల్ స్కూల్)..బాలుర విభాగంలో ఆదిత్య(మానస స్కూల్), చైతన్య శ్రీనివాస్(సెయింట్ జోసెఫ్ స్కూల్) ఎంపికయ్యారు. అండర్-14 బాలికల విభాగంలో బి. షణ్ముఖ ప్రియ(సెయింట్ ఆన్స్ ప్రభుత్వ పాఠశాల), జి. కుందన ప్రియ(నేషనల్ స్కూల్), బాలుర విభాగంలో జీకేఎం అభినవ్ రెడ్డి (బీపీఎం ప్రభుత్వ పాఠశాల), వి.లోకేష్(భాష్యం) ఎంపికయ్యారని ప్రకటించారు. అండర్-16 బాలికల విభాగంలో కె.లహరి(జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మరడాం), సీహెచ్. గాయత్రి దేవి(ఏపీ మోడల్ స్కూల్, మరుపల్లి), బాలుర విభాగంలో డి.లీలా మనోహర్(ఫోర్ట్ సిటీ స్కూల్) కె.హర్ష వర్ధన్ (పల్లవి స్కూల్)లు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన వారిలో ఉన్నారు.

ఆలిండియా బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

- వచ్చే నెల 26నుంచి పంజాబ్‌లో పోటీలు


ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలకు జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు అర్హత సాధించారు. ఇటీవల విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన అంతర్ కళాశాలల చాంపియన్ షిప్‌లో ఉత్తమప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారులు పతకాలు దక్కించుకోవడంతో పాటు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారుల్లో ఎస్.తేజేశ్వర్ 48 కిలోల విభాగంలో బంగారుపతకం, ఎ.సాయి 51 కిలోల విభాగంలో బంగారు పతకం, జి.లిఖిత్‌రెడ్డి 92 కేజీల విభాగంలో బంగారు పతకం, ఎస్.కె.సుల్తానా కాంస్య పతకం దక్కించుకున్నారు. ఆ నలుగురు క్రీడాకారులు డిసెంబర్ 26 నుంచి జనవరి2వ తేదీవరకు పంజాబ్‌లో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఆంధ్రా యూనివర్సిటీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. యూనివర్సిటీ స్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోలా మన్మథకుమార్, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు ఎస్.ఈ.రాజు, పీఎల్.ప్రసాద్, రింగ్ ఆఫీషియల్స్ వి.సంతోష్‌కుమార్, పి.శ్రీనివాసరావు, బి.జగదీష్‌నాయుడు తదితరులు అభినందించారు.

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు


ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో వేదపండితులు అమ్మవారికి శాస్త్రోక్తంగా చండీయాగం నిర్వహించారు. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వాలీబాల్ పోటీల్లో మడ్డువలస విద్యార్థి సత్తా


మెడల్, షీల్డ్‌తో సాయిబాలాజీ

వంగర: విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో మండల పరిధిలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆవు సాయిబాలాజీ సత్తా చాటాడు. జిల్లా జట్టును రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపడంలో కీలక పాత్ర పోషించడం పట్ల ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు, అధ్యాపకులు, తల్లిదండ్రులు ఆవు చిన్నప్పలనాయుడు, సుభాషిణి తదితరులు బాలాజీని అభినందించారు.

మానవ మనుగడకు మహిళలే ఆలంబన


సేవారంగంలో రాణిస్తున్న మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: స్త్రీ లేకపోతే జననం లేదు. గమనం లేదు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. అసలు సృష్టే లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం గురజాడ స్మారక కేంద్ర గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ తల్లిగా లాలిస్తూ..తోబుట్టువుగా..భార్యగా బాగోగులు చూస్తూ.. సేవకురాలిలా కుటుంబ భారాన్ని మోసేది మహిళే అని అన్నారు. మానవ ఉనికికి మూలం, మనుగడకు ఆలవాలం మహిళేనని మానవ బంధాలను, సంబంధాలను కలుపుతూ కదిలే కావ్యం మహిళ అని వివరించారు. ఈ సందర్భంగా సామాజిక సేవా రంగంలో కృషిచేసిన 15 మంది మహిళలకు సంఘం అధ్యక్ష కార్యదర్శులు గురుప్రసాద్, సుభద్రాదేవిలతో కలసి పతకాలను ప్రదానం చేసి అభినందించారు. సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ గోటేటి హిమబిందు, నిర్మల, రమణమ్మ, దాసరి పద్మ, సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ


గుళ్లపాడులో వేతనదారులను అడిగి వివరాలు సేకరిస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని గుళ్లపాడు పంచాయతీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మీసాల మంగమ్మపై మంగళవారం విచారణ నిర్వహించారు. ఎంపీడీఓ శ్యామలాకుమారి, ఏపీఓ హరనాథలు ఈ విచారణ చేపట్టారు. వేతనదారులను పిలిపించి పనులు సక్రమంగా జరుగుతున్నాయా? ఫీల్డ్ అసిస్టెంట్ సకాలంలో జాబ్‌కార్డులు ఇస్తున్నారా? అని ఆరా తీశారు. వేతనదారులు ఇచ్చిన వివరాలతో నివేదిక తయారీచేసి జిల్లా అధికారులకు అందిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

పింఛన్ల రికవరీపై విచారణ

- లోకాయుక్త ఆదేశాలతో కదిలిన యంత్రాంగం


విచారణ చేస్తున్న అధికారులు

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల గ్రామానికి చెందిన అనర్హులైన ఏడుగురు వ్యక్తులు పింఛన్లు తీసుకుంటున్నారని లోకాయుక్తకు అందిన ఫిర్యాదుతో పలుమార్లు విచారణ చేపట్టిన అధికారులు తాజాగా మంగళవారం మళ్లీ గ్రామంలో మరోమారు విచారణ చేపట్టారు. పాలకొండ డీఎల్‌డీఓ వి.గోపాలకృష్ణ, తహసీల్దార్ చందక సత్యనారాయణ, ఎంపీడీఓ బి.వెంకటరమణలు పింఛన్‌దారులను పిలిపించి వివరాలు సేకరించారు. గత టీడీపీ పాలనలో 2018-19 మధ్య కాలంలో గ్రామానికి చెందిన ఎస్.లచ్చిశెట్టి రూ.23,500(11 నెలలు),గంట రాము రూ.23,500(11 నెలలు),బోను అప్పయ్య రూ.34,750(21 నెలలు), కొమరాపు పోతయ్య రూ.34,750(21 నెలలు),బి.లక్ష్మం రూ.34,750 (21నెలలు) వై.వెంకయ్య రూ.32,500(19 నెలలు) కె.సీతమ్మ రూ.29,000(14 నెలలు) మొత్తం రూ.2,12,750లు వృద్ధాప్యపు పింఛన్ల ద్వారా తీసుకున్నారని, వారంతా అనర్హులని గ్రామానికి చెందిన యామక అప్పలనాయుడు అప్పట్లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై పలుమార్లు అధికారులు విచారణ చేశారు. 2019లో డిసెంబర్‌లో వీరికి వస్తున్న పింఛన్లను అధికారులు నిలిపివేశారు. వారి నుంచి ఆర్‌ఆర్ యాక్ట్ ప్రకారం రికవరీ చేయాలని ఈ ఏడాది ఆగస్టులో లోకాయుక్త నుంచి ఆదేశాలు అందాయి. రికవరీ ఎందుకు చేయలేదని మరోమారు లోకాయుక్త నుంచి ఆదేశాలు రావడంతో విచారణ చేపట్టినట్లు డీఎల్‌డీఓ గోపాలకృష్ణ తెలిపారు.అయితే వారిలో ఇద్దరు వ్యక్తులు వై.వెంకయ్య,కె.సీతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందినట్లు గుర్తించారు.మిగిలిన వారిని పిలిచి విచారణ చేశామని అధికారులు తెలిపారు. తొందరగా తీసుకున్న సొమ్ము తిరిగి కట్టాలని వారిని ఆదేశించామని అధికారులు చెప్పారు.

ఉపాధి వేతనదారుకు అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వేతనదారు అప్పలస్వామి

బాడంగి: ఓ విషపురుగు పాదంపై కాటు వేయడంతో ఉపాధివేతనదారు అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలాఉన్నాయి. మండలంలోని రేజేరు గ్రామానికి చెందిన పూడి అప్పలస్వామి ఉపాధి వేతనదారు. ఎప్పటిలాగానే పనిలోకివెళ్లి పనిచేస్తుండగా కనిపించని విషపురుగు కాలిపాదంపై కాటువేయగా స్పృహకోల్పోయాడు. వెంటనే తొలుత తెర్లాం పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం స్థానిక సీహెచ్‌సీకి తరలింగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతానికి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు. ఎంపీడీఓ ఎస్ రామకృష్ణ పరామర్శకు వెళ్లగా ఒకరోజుపాటు తమ అబ్జర్వేషన్‌లో ఉంచాలని డాక్టర్లు చెప్పారు.

తాగునీటి పరీక్షలు నిర్వహించాలి

- అధికారులకు కలెక్టర్ సూచన


మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విధిగా తాగునీటి పరీక్షలు నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో తాగునీరు, పారిశుద్ధ్యంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో రన్నింగ్ వాటర్ సదుపాయం ఉండాలని, బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. తాగునీరు లీకేజి ఎక్కడా ఉండకుండా చూడాలని, వ్యక్తిగత మరుగుదొడ్లు లేని ఇళ్లకు తక్షణం మంజూరు చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలకు మంజూరైన మరుగుదొడ్లను డిసెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని, మరుగుదొడ్ల వినియోగంపై అధికారులతో పాటు స్వయం సహాయక సంఘాలు కూడా ముందుకు వచ్చి అవగాహన కల్పించాలని కోరారు. విద్యాసంస్థల్లో చేతుల పరిశుభ్రతను చేపట్టి అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఒ. ప్రభాకరరావు మాట్లాడుతూ జిల్లాలో జల్‌జీవన్ మిషన్ కింద రూ.494.53 కోట్లతో 2,859 పనులు మంజూరయ్యాయని ఇంతవరకు రూ.196కోట్లతో 1289 పనులు చేపట్టామని, అందులో 732 పనులు పూర్తయ్యాయని, 557 పనులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, డీపీఓ టి.కొండలరావు, డీఈఓ ఎన్.తిరుపతినాయుడు, భూగర్భ జలాల అధికారి ఎ.రాజశేఖరరెడ్డి, ఇరిగేషన్ ఈఈ ఆర్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

300 సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్ట్

సీతానగరం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీతానగరం సర్కిల్ పరిధిలో ఉన్న గరుగుబిల్లి మండల కేంద్రం ప్రధాన రహదారిపై సోదాలు చేస్తుండగా ఒకవ్యక్తి దగ్గరున్న ప్లాస్టిక్ సంచిలో 300 సారా ప్యాకెట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ డి. పద్మావతి తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ మంగళవారం మూడు మండలాల్లో సిబ్బందితో ప్రధాన రహదారుల్లో వాహనాలు సోదా చేశామన్నారు. ఈ సోదాల్లో గురుగుబిల్లి మండలకేంద్రం సమీపంలో సారా ప్యాకెట్లతో పట్టుబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయించినా, బెల్ట్‌షాపులు నిర్వహించినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయాలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

30 మద్యం బాటిల్స్ స్వాధీనం

బొబ్బిలిరూరల్: మండలంలోని కొత్త పెంట గ్రామానికి చెందిన బొబ్బిలి రాంబాబు అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఈ మేరకు ఏఎస్సై భాస్కరరావు చెప్పిన వివరాల ప్రకారం సాయంత్రం బొబ్బిలి నుంచి కొత్త పెంట గ్రామానికి తరలించేందుకు సిద్ధం చేసిన 30 మద్యం బాటిల్స్‌ను గొల్లవీధి జంక్షన్‌లో పట్టుకుని రాంబాబును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్సై భాస్కరరావు వివరించారు.

అనారోగ్య శిశువు జన్మించకూడదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

- కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: రానున్న రోజుల్లో జిల్లాలో ఆరోగ్యపరమైన లోపాలతో ఏ ఒక్క శిశువూ జన్మించకూండా చూడాలనే లక్ష్యంతో అన్ని శాఖలు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ అన్నారు. కిశోరీ బాలికల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను కిందిస్థాయి వరకు తీసుకువెళ్లి అవగాహన కల్పించడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని అభిప్రాయ పడ్డారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిశోరీ వికాసం కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ప్రసవాల్లో 6 శాతం మంది పిల్లలు రక్తహీనత, మరికొంతమంది తగిన బరువు లేకుండా, ఇతర లోపాలతో పుడుతున్నారన్నారు. తక్కువ వయసులో జరిగే వివాహాలు, తగిన పోషకాహారం తీసుకోకపోవడం వంటి కారణాలే గర్భిణుల్లో అనారోగ్యానికి దారితీస్తున్నాయనే విషయాన్ని అర్థమయ్యేలా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు, డీఈఓ మాణిక్యం నాయుడు, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, డీసీపీయూ యాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారులు సహకరించాలి


- ఎస్పీ వకుల్ జిందాల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో నమోదవుతున్న సైబర్ మోసాల నియంత్రణకు బ్యాంక్ అధికారులు ప్రత్యేక బాధ్యత వహించి, సైబర్ కేసులను దర్యాప్తు చేసే పోలీసు అధికారులకు సహాయ, సహకారాలు అందించాలని ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. ఈ మేరకు వివిధ బ్యాంకుల్లో పనిచేస్తున్న మేనేజర్లు, ఇతర అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ మోసాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, మోసగాళ్లు కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతూ, ప్రజల నుంచి డబ్బులను దోచేస్తున్నారని, ఈ తరహా మోసాలను నియంత్రించేందుకు బ్యాంక్ అధికారులు కూడా సకాలంలో స్పందించి, వారివంతు సహాయ, సహకారాలను పోలీసు అధికారులకు అందించాలని కోరారు. పోలీసు అధికారులు కూడా దర్యాప్తులో భాగంగానే బ్యాంకుల నుంచి సమాచారాన్ని కోరుతారన్న విషయాన్ని అధికారులు గ్రహించాలని చెప్పారు. దర్యాప్తు అధికారులు కోరిన సమాచారాన్ని బ్యాంక్ అధికారులు సకాలంలో స్పందించి సమాచారాన్ని ఇవ్వకుంటే మోసానికి పాల్పడిన వ్యక్తి తప్పించుకునే ఆస్కారంతో పాటు తన బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన నగదును ఇతర బ్యాంక్ అకౌంట్‌లకు ట్రాన్స్‌ఫర్ చేసే అవకాశం ఉంటుందన్నారు.

క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

కొత్తగా బ్యాంక్ అకౌంట్‌ను ప్రారంభించే సమయంలో ఖాతాదారు గుర్తింపు కార్డులను పూర్తిగా వెరిఫై చేసిన తర్వాతనే బ్యాంక్ అకౌంట్ ప్రారంభమయ్యే విధంగా చూడాలని సూచించారు. అలాగే ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలు జరిపే అనుమానాస్పద బ్యాంక్ అకౌంట్‌లపై నిఘా పెట్టాలని, ఏటీఎం కేంద్రాలు, బ్యాంకుల్లో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులుండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. బ్యాంక్‌లు, ఏటీఎం కేంద్రాలను రాత్రి గస్తీ సమయాల్లో పోలీసు సిబ్బంది, అధికారులు సందర్శించే విధంగా పాయింట్ బుక్కులను ఏర్పాటు చేసుకునే విధంగా స్థానిక పోలీసు అధికారుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. ఆర్థిక మోసాలకు సంబంధించిన కేసుల్లో సమయం చాలా ముఖ్యమైనదని, ఇవ్వాల్సిన సమాచారాన్ని సకాలంలో బ్యాంక్ అధికారులు దర్యాప్తు అధికారులకు అందిస్తే, మోసాలకు పాల్పడిన నిందితులు పరారీ కాకుండా త్వరితగతిన పట్టుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐలు, వివిధ బ్యాంకుకు చెందిన మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


హాజరైన బ్యాంక్ మేనేజర్లు, అధికారులు